
మృతులు మనోజ్‌కుమార్, వెజిస్ (ఫైల్ ఫోటో)

అలల్లో చిక్కుకుని...

ఐదుగురు ట్రైనీ డాక్టర్లు సహా ఎనిమిదిమంది దుర్మరణం

పెరంబూర్, మే 6: కన్నియాకుమారి జిల్లాలో సంభవించిన వేర్వేరు ఘటనల్లో ఐదుగురు ట్రైనీ డాక్టర్లు సహా 8 మంది మృత్యువాతపడ్డారు. రాష్ట్ర సముద్రతీరాల్లో వాతావరణ మార్పుల కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో, కన్నియాకుమారి జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ కారణంగా పర్యాటక ప్రాంతాలు, సముద్రతీరాల్లో ఎవరూ స్నానాలకు దిగరాదని జిల్లా కలెక్టర్ ఇప్పటికే హెచ్చరిక జారీచేశారు. అలాగే, ఆదివారం సముద్రతీరంలో స్నానాలకు వెళ్లిన ఇద్దరు మృతిచెందగా, తేంగాయ్‌పట్టణంలోని సముద్రతీరంలో స్నానం చేస్తున్న ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఈ నేపథ్యంలో, కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ సమీపం పరక్కై గ్రామానికి చెందిన సర్వదర్శిత్ (23) తిరుచ్చి ఇరుంగళూర్‌లోని వైద్యశాలలో ట్రైనీ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. నాగర్‌కోయిల్‌లో జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు సర్వదర్శిత్, అతడి స్నేహితులు దిండుగల్‌కు చెందిన ప్రవీణ్ సాయి, చారుకవి, గాయత్రి, వెంకటేష్, నేసి తదితరులు నాగర్‌కోయిల్ వచ్చారు. వారు సోమవారం ఉదయం తిర్‌పరప్పు జలపాతానికి వెళ్లారు. జలపాతంలో తక్కువగా నీరు ఉండడంతో వారు అక్కడి నుంచి నాగర్‌కోయిల్ సమీపంలోని గణపతిపురం లేమూరు సముద్రతీరానికి చేరుకున్నారు. వారు తీరంలో స్నానాలు చేస్తున్న సమయంలో హఠాత్తుగా వచ్చిన అలలకు ఆరుగురు కొట్టుకుపోయారు. వీరిని గమనించిన జాలర్లు వారిని రక్షించేందుకు యత్నించి, సర్వదర్శిత్, నేసిలను రక్షించి ఆచారిపల్ల ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో గల్లంతైన మరో నలుగురి కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కొద్దిసేపటి తర్వాత నలుగురు మృతదేహాలు తీరానికి కొట్టుకొచ్చాయి. ఈ క్రమంలో, ఆసుపత్రిలో చేరిన సర్వదర్శిత్ చికిత్స ఫలించక మృతిచెందాడు. నేసికి చికిత్స కొనసాగిస్తున్నారు. విహారయాత్రకు వచ్చిన ట్రైనీ డాక్టర్లు ఐదుగురు మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది.

బాలిక మృతదేహం లభ్యం...

ప్రేమదాస్ కుమార్తె ఆదీషా (7)తో ఆదివారం ఉదయం కన్నియాకుమారి జిల్లా తేంగాయపట్టణం సముద్రతీరంలో అలల తాకిడికి గల్లంతైన విషయం తెలిసిందే. ఆమె కోసం తీర ప్రాంత భద్రతాదళం, జాలర్లు గాలించినా ప్రయోజనం లేకపోయింది.


మృతదేహాలు వెలికితీయిస్తున్న పోలీసులు

ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఆదీషా మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

చెన్నైకి చెందిన ఇద్దరు...

స్థానిక చూలైమేడు, విల్లివాక్కం ప్రాంతాలకు చెందిన 20 మంది వ్యానులో విహారయాత్రకు బయల్దేరారు. తిరుచ్చి, మదురై, వాడిపట్టి మీదుగా ఆదివారం రాత్రి కన్నియాకుమారి చేరుకున్నారు. వారు కన్నియాకుమారిలో రాత్రి బసచేసి సోమవారం ఉదయం కుళచ్చల్ సమీపం కోడిమునైకు వచ్చారు. వారిలో చూలైమేడు ప్రభుత్వ మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తమిళ్‌సోనియా భర్త వెజిస్ (54), డీపీఐ (పాఠశాల పరీక్షల విభాగం)లో పనిచేస్తున్న మనోజ్‌కుమార్ (25) సహా ఆరుగురు సముద్రతీరంలోని రాళ్లపై నిల్చున్నారు. ఆ సమయంలో వచ్చిన భారీ అలకు ఆరుగురు కొట్టుకుపోయారు. వీరిని గమనించిన జాలర్లు మూడు ఫైబర్ పడవల్లో వెళ్లి నలుగురిని రక్షించారు. కొద్దిసేపటికి వెజిస్, మనోజ్‌కుమార్ మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై కుళచ్చల్ మెరీన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రైనీ డాక్టర్ల మృతిపై సీఎం దిగ్భ్రాంతి

కన్నియాకుమారి జిల్లాలో సముద్ర అలల్లో కొట్టుకుపోయిన ఐదుగురు ట్రైనీ డాక్టర్లు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ట్రైనీ డాక్టర్ల మృతి మనసును కలిచివేసిందన్నారు. ఈ ఘటన తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్‌ను సంప్రదించి చేపట్టిన చర్యల పై అడిగి తెలుసుకున్నానన్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నానని తెలిపారు. ఎన్నికల సంఘం అనుమతితో మృతుల కుటుంబాలకు పరిహారం అందించే చర్యలు చేపడతామన్నారు. అలాగే, ఈ ఘటనపై గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థికి మెరుగైన చికిత్స అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించినట్లు సీఎం తెలిపారు.

ఓట్ల లెక్కింపునకు దరఖాస్తుల స్వీకరణ

● రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహు



ప్యారీస్, మే 6: రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో, ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగనుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే అభ్యర్థుల ఏజెంట్లు ఆయా ప్రాంతాల రిటర్నింగ్ అధికారుల వద్ద దరఖాస్తు సమర్పించి గుర్తింపు కార్డు పొందాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహూ సూచించారు. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో నమోదైన ఓట్లు కలిగిన ఈవీఎం, వీవీ పాడ్‌లను 39 కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ప్రస్తుతం ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు సత్యప్రదసాహూ సోమవారం మీడియాకు వివరించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఒక్కొక్క టేబుల్‌కు అభ్యర్థుల తరఫున పాల్గొనాల్సిన ఏజెంట్ల సంఖ్యపై అభ్యర్థులకు ఈసీ తరఫున లేఖ రాసినట్లు తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గం సహా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏజెంట్లను నియమించాలని, ఒక నియోజకవర్గంలో 14 టేబుళ్లుంటే టేబుల్‌కు ఒకరు చొప్పున ఒక ఏజెంట్‌ను నియమించుకోవాలని తెలిపారు. ఇక పోస్టల్ ఓట్లు లెక్కించే ప్రాంతంలో ఒక టేబుల్‌కు ఒకరి చొప్పున ఆరు టేబుళ్లకు ఆరుగురు ఏజెంట్లను నియమించాలని తెలిపారు. ఒక పార్లమెంటు నియోజకవర్గానికి ఒక అభ్యర్థి తరఫున మొత్తం 98 మంది ఏజెంట్లను నియమించాలని, వీరికి 18 ఏళ్లు నిండి ఉండాలని, ఇందు కోసం కేటాయించిన 18వ నెంబరు దరఖాస్తులో ఏజెంట్ల పేర్లు, సంతకంతో రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాల్సి ఉందన్నారు. అదే సమయంలో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు, కార్పొరేషన్ మేయర్లు, డిప్యూటీ మేయర్లు, పంచాయతి చైర్మెన్లు, సర్పంచ్‌లు, స్టాండింగ్ కమిటీ చైర్మెన్లు, ప్రభుత్వ, ఎయిడెడ్ సంస్థల్లో పార్ట్ టైం ఉద్యోగులు, రేషన్ దుకాణాలు, అంగన్వాడీలు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఉద్యోగులను అభ్యర్థులు తమ ఏజెంట్లుగా నియమించరాదని లేఖలో సూచించినట్లు సత్యప్రద సాహూ తెలిపారు.

నేడు ఏడు జిల్లాలకు వర్ష సూచన



అడయార్, మే 6: రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వేసవి ఎండలు మండిపోతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రజలు పగటిపూట బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. ఏడు జిల్లాలకు వర్ష సూచన చేసింది. రాష్ట్రం మీదుగా వీచే గాలులు దిశ మార్చుకోవడంతో వర్షం పడేందుకు అవసరమైన సానుకూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కారణంగా సోమవారం రాష్ట్రంలోని ఒకటి రెండు ప్రాంతాల సహా పుదుచ్చేరి, కారైక్కాల్‌లలోని కొన్ని చోట్ల ఉరుములు, పిడుగులతో వర్షం పడింది. బలమైన గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని పేర్కొంది. అదేవిధంగా మంగళవారం నీలగిరి, కోయంబత్తూరు, ఈరోడ్, సేలం, ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. 8వ తేదీ మంగళవారం నీలగిరి, కోయంబత్తూరు, దిండిగల్, తేని, తెన్‌కాశి, విరుదునగర్, తిరునెల్వేలి జిల్లాల్లో ఒకటీరెండు చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదేవిధంగా ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల సహా పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఉత్తర తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో కొన్ని చోట్ల 104 నుంచి 109 డిగ్రీల సెల్సియస్ మేరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. రాజధాని నగరం చెన్నైతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, గరిష్ఠంగా 104 డిగ్రీల మేరకు పగటి ఉష్ణోగ్రత నమోదు కావచ్చని వెల్లడించింది. తమిళనాడు - ఆంధ్రప్రదేశ్ కోస్తా తీర ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఒక దశలో ఈ గాలుల వేగం 65 కిలోమీటర్ల వరకు చేరుతుందని తెలిపారు. అందువల్ల జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్ళవద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.


ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని ప్లస్-2 ఫలితాల నివేదికను అందిస్తున్న పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్

ప్లస్-2 పరీక్షల్లో

94.56 శాతం ఉత్తీర్ణత

ఈ సారీ బాలికలదే పైచేయి

బాలికల ఉత్తీర్ణతా శాతం 96.44 ● బాలుర ఉత్తీర్ణతా శాతం 92.37

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం ఉదయం ప్లస్-2 ఫలితాలు విడుదలయ్యాయి. ఈ పరీక్షల్లో 94.56 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఎప్పటిలానే ఈ సారికూడా బాలికలే అత్యధిక సంఖ్యలో ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఈ ఫలితాలను పాఠశాలల విద్యాశాఖ డైరెక్టర్ సేతురామ వర్మ విడుదల చేశారు. ప్లస్-2 పరీక్షలు మార్చి ఒకటి నుంచి 22 వరకు జరిగాయి. ఇక ఈ పరీక్షల మూల్యాంకనం ఏప్రిల్ రెండున ప్రారంభమై, 13వరకు జరిగింది. తర్వాత విద్యార్థినీ విద్యార్థుల మార్కులు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ కూడా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ఈ ఫలితాలు వెలువడ్డాయి.


అశోక్‌నగర్ ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో విద్యార్థినుల సందడి

96.44 శాతం బాలికల ఉత్తీర్ణత...

ఈ పరీక్షలలో 96.44 శాతం మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. 7,19,196మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 3,93,890 (96.44శాతం) మంది బాలికలు కాగా, 3,25,305 (92.37శాతం) మంతి బాలురు. ఈ పరీక్షలలో బాలుర కంటే 4.07 శాతం అధికంగా బాలికలు ఉత్తీర్ణులు కావటం విశేషం. గతేడాది ప్లస్-2 పబ్లిక్ పరీక్షలలో 94.03 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఈ యేడాది 0.53 శాతం అధికంగా అంటే 94.56 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.


వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ఆనందంలో బాలికలు

తిరుప్పూరు జిల్లా ఫస్ట్...

ప్లస్-2 పబ్లిక్ పరీక్షల్లో అన్ని జిల్లాల కంటే అధికంగా తిరుప్పూరు జిల్లాలో 97.45 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. దీంతో ఆ జిల్లా ఉత్తీర్ణతా శాతంలో ప్రథమస్థానంలో నిలిచింది. ఆ జిల్లాలో 23,849 మంది పరీక్షలకు హాజరుకాగా, 23,242 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదే విధంగా ఈరోడ్, రామనాధపురం జిల్లాలు 97.43 శాతం ఉత్తీర్ణత సాధించి ద్వితీయ స్థానంలోను, అరిలయలూరు జిల్లా 97.25 శాతం ఉత్తీర్ణతతో తృతీయ స్థానంలో నిలిచింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 7532 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పరీక్ష రాయగా 2,578 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రభుత్వ మహన్నోత పాఠశాలల్లో 397 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 91.03 శాతం ఉత్తీర్ణత, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు 95.49 శాతం ఉత్తీర్ణత పొందాయి. ప్రైవేటు, స్వయం ప్రతిపత్తి పాఠశాలలు 94.78 శాతం ఉత్తీర్ణత సాధించాయి. బాలికల పాఠశాలలు 96.39 శాతం ఉత్తీర్ణత, బాలుర పాఠశాలలు 88.98 శాతం ఉత్తీర్ణత పొందాయి. రాష్ట్రవ్యాప్తంగా 5603 మంది దివ్యాంగులు ఈ పరీక్షకు హాజరుకాగా 5161 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదే విధంగా వివిధ జైళ్లలో ఉన్న ఖైదీలు 125 మందిలో 115 మంది ఉత్తీర్ణులయ్యారు.

పాఠ్యాంశాలవారీగా...

ప్లస్-2 పబ్లిక్ పరీక్షలలో వివిధ పాఠ్యాంశాల వారీగా ఉత్తీర్ణతా శాతం వివరాలను కూడా అధికారులు ప్రకటించారు. ఆ మేరకు భౌతిక శాస్త్రంలో 98.48 శాతం, రసాయన శాస్త్రంలో 99.14 శాతం, బయాలజీలో 99.35 శాతం, గణితంలో 98.57 శాతం, బోటనీలో 98.86 శాతం, జువాలజీలో 99.04 శాతం, కంప్యూటర్ సైన్స్‌లో 99.80 శాతం, కామర్స్‌లో 97.77 శాతం, అకౌంటెన్సీలో 96.61 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గణిత శాస్త్రంలో 2586 మంది విద్యార్థులు నూటికి నూరు మార్కులు సాధించారు. కంప్యూటర్ సైన్స్‌లో 6996 మంది వంద మార్కులు సాధించారు. భాషా సంబంధిత పాఠ్యాంశాల్లో 732 మంది వందకు వంద శాతం మార్కులు పొందారు.

నేటినుంచి రీ టోటల్‌కు దరఖాస్తులు...

ప్లస్-2 పరీక్షలకు సంబంధించి రీ టోటల్, రీ వాల్యుయేషన్‌కు మంగళవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు సేతురమ వర్మ తెలిపారు. ఈ పరీక్షలల్లో గత యేడాదికంటే 0.5 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. విద్యార్థులు తమ మార్కులు వివరాలు తెలుసుకున్న తర్వాత ఏవైనా అనుమానాలుంటే రీ టోటలింగ్, రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇక ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ వారం లోగా తాత్కాలిక మార్కులు జాబితా అందజేస్తామని తెలిపారు. ఇంజనీరింగ్ తదితర ఉన్నతవిద్యా కోర్సుల అడ్మిషన్లు ప్రారంభం కానుండటంతో విద్యార్థులు తమ రిజిస్టర్ నెంబర్ లేదా, పుట్టిన తేదీ ఉపయోగించి తాత్కాలిక మార్కుల జాబితా సులువుగా పొందవచ్చని ఆయన తెలిపారు.

జిల్లాల వారీగా ప్లస్ టూ ఉత్తీర్ణత వివరాలు

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పరీక్షా ఫలితాలు మెరుగ్గా వున్నాయి. జిల్లాల వారీ ఫలితాల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఆ వివరాలిలా వున్నాయి...

జిల్లా	ఉత్తీర్ణత శాతం	జిల్లా	ఉత్తీర్ణత శాతం
కన్నియాకుమారి	95.72	అరియలూరు	97.25
తిరునల్వేలి	96.44	పెరంబలూరు	96.44
తెన్‌కాశి	96.07	తిరుచ్చి	95.74
తూత్తుకుడి	96.39	నాగపట్టినం	91.19
రామనాధపురం	94.89	మైలాడుదురై	92.38
శివగంగ	97.42	తిరువారూరు	93.08
విరుదునగర్	96.64	తంజావూరు	93.46
తేని	94.65	విల్లుపురం	93.17
మదురై	95.19	కళ్ళకురిచ్చి	92.91
దిండుగల్	95.40	కడలూరు	94.36
నీలగిరి	94.27	తిరువణ్ణామలై	90.47
తిరుప్పూరు	97.45	వేలూరు	92.53
కోయంబత్తూరు	96.97	తిరుపత్తూరు	92.34
ఈరోడ్	97.42	రాణిపేట	92.28
సేలం	94.60	కాంచీపురం	92.28
నామక్కల్	96.10	చెంగల్పట్టు	94.71
కృష్ణగిరి	91.87	తిరువళ్లూరు	91.32
ధర్మపురి	93.55	చెన్నై	94.48
పుదుకోట	93.79	కారైక్కాల్	87.03
కరూరు	95.90	పుదుచ్చేరి	93.38


సమావేశంలో ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న సీఎస్ శివదాస్ మీనా

విద్యుత్ కోతలు వద్దు

● అధికారులకు సీఎస్ ఆదేశం

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ఎండల తీవ్రత అధికంగా వుండడంతో రాత్రిపూట ప్రజలకు ఇబ్బంది లేకుండా నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయాలని, కోతల్లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా విద్యుత్ బోర్డ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. నగరంలోని విద్యుత్ బోర్డు ప్రధాన కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు.నగరంలో పలు చోట్ల రాత్రిపూట విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై డ్యూటీలో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలన్నారు. అగ్నినక్షత్రం ఎండలు తీవ్ర రూపంగా ఉండటంతో 20,830 మెగావాట్ల విద్యుత్ అవసరమవుతోందని ఆయన తెలిపారు. అధికమైన ఈ విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచి ప్రజలకు నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు ఇబ్బంది పడకూడదని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.

కార్పొరేషన్ పాఠశాలల్లో 87.13 శాతం ఉత్తీర్ణత

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కూళ్లలో ప్లస్-2 పరీక్షల్లో 87.13 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణుల య్యారని జీసీసీ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ తెలిపారు. సోమవారం ఉదయం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..4998 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వారిలో 4355 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. నగరంలోని కార్పొరేషన్ ఆధ్వర్యంలోని 35 ఉన్నత పాఠశాలలకు గాను నుంగంబాక్కం పాఠశాల మాత్రమే వంద శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. ఇక కార్పొరేషన్ పాఠశాల్లో చదివిన విద్యార్థులలో పూంగోదై, షారూఖ్, దివ్యశ్రీ, హరిణి ప్రియా అనే విద్యార్థులు 90 శాతం కంటే అధిక మార్కులు సాధించారు. వీరిలో స్కూల్ ఫస్ట్ ర్యాంకులు వచ్చినవారు కూడా ఉన్నారు. వీరిలో పూంగోదై ఆటో డ్రైవర్ కుమార్తె. పెరంబూరు మాధవరం హైరోడ్డులోని బాలికల పాఠశాలలో చదివింది. బి.కామ్ అకౌంటెన్సీ లేదా ఫైనాన్స్ చదవాలన్నదే తన లక్ష్యమని పేర్కొంది.



కార్పొరేషన్ పాఠశాలల ప్లస్-2 ఫలితాల వివరాలను చెబుతున్న జీసీసీ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్

ప్లస్ టూ పరీక్షల్లో 92.53 శాతం ఉత్తీర్ణత

వేలూరు, మే 6: ప్లస్ టూ పరీక్షల్లో జిల్లాలో 92.53 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలోని 138 పాఠశాలలకు చెందిన 6,032 మంది విద్యార్థులు, 7,503 మంది విద్యార్థినులు ప్లస్ టూ పరీక్షలు రాశారు. వాటి ఫలితాలు సోమవారం విడుదల కాగా, 5,393 మంది విద్యార్థులు, 7,131 మంది విద్యార్థినులు మొత్తం 92.53 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే, 28 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. వీటిలో రెండు ప్రభుత్వ పాఠశాలలున్నాయి. పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత 89 శాతం, విద్యార్థినుల ఉత్తీర్ణత 95 శాతం ఉంది. గత ఏడాది కన్నా ఈ ఏడాది 3.53 శాతం ఉత్తీర్ణత శాతం పెరిగిందని, 2022-23 విద్యా సంవత్సరం వెలువడని ప్లస్ టూ పరీక్షా ఫలితాల్లో జిల్లా 37వ స్థానంలో నిలువగా, 2024-24 విద్యా సంవత్సరంలో 30వ స్థానంలో నిలిచిందని విద్యాశాఖ తెలియజేసింది.


ప్రభుత్వ మహిళా ఉన్నత పాఠశాలలో ప్లస్ టూ ఫలితాలను చూస్తున్న విద్యార్థినులు

రైళ్లలో నీళ్లు లేక ప్రయాణికుల అగచాట్లు

ఐసిఎఫ్, మే 6: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నీళ్ల లేక ప్రయాణికులు అగచాట్లకు గురవుతున్నారు. వేసవి సెలవుల కారణంగా చెన్నై నుంచి సొంతూర్లకు, విహారయాత్రలకు ప్రజలకు వెళుతున్నారు. చెన్నై సెంట్రల్, ఎగ్మూర్ నుంచి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నింపేందుకు నీరు కొరత ఏర్పడింది. భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రైవేటు ట్యాంకర్ల నీటితో అవసరాలు పూర్తిచేయలేకపోతున్నారు. పనిదినాల్లో 50 శాతం, వారాంతపు దినాల్లో 75 శాతం నీటిని ఫిల్ చేస్తుండగా, ప్రస్తుతం వారాంతపు దినాల్లో 25 శాతం మాత్రమే నీటిని నింపుతున్నారు. దీంతో రైలు బయల్దేరిన రెండు, మూడు గంటల్లోపే నీరు ఖాళీ అయి ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. నీరు లేక టాయిలెట్లతో దుర్గంధం వస్తోంది. ప్రస్తుతం నగరంలో నెలకొన్న నీటి ఎద్దడి కారణంగా సరిపడా నీరు నింపలేకపోతున్నామని అధికారులు తెలియజేస్తున్నారు.

కాట్పాడి ప్రభుత్వ పాఠశాల ప్లస్ టూలో 91 శాతం ఉత్తీర్ణత

వేలూరు, మే 6: స్థానిక కాట్పాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 227 మంది విద్యార్థులు ప్లస్ టూ పరీక్షలు రాయగా, సోమవారం విడుదలైన ఫలితాల్లో 205 మంది ఉత్తీర్ణులయ్యారు. ఆటో డ్రైవర్ కుమార్తె దర్శిని 600 మార్కులకు 580 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. పేద కుటుంబానికి చెందిన దర్శినికి ఉపాధ్యాయులు, హెచ్ఎం శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సోమవారం పాఠశాలకు వచ్చి హెచ్ఎం సరళ, ఉపాధ్యాయులు జనార్ధనన్, వెంకటేశన్, నివేదిత, సంగీత, శ్రీమతి, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల కమిటీ అధ్యక్షుడు థామస్‌ల ఆశీస్సులు పొందారు. అలాగే, కోట రౌండ్ రోడ్డులోని ఆదిద్రావిడ హాస్టల్‌లో ఉంటూ ప్లస్ టూ పరీక్షలు రాసిన 10 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యాయని వార్డెన్ కరుణానిధి తెలిపారు.

డీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

వేలూరు, మే 6: కాట్పాడి డీఎంకే ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమానికి దక్షిణ ప్రాంత సెక్రటరీ వన్నియరాజ పుష్పలత అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కార్తికేయన్ పాల్గొని చలివేంద్రం ప్రారంభించి, ప్రజలకు మజ్జిగ, పుచ్చకాయలు, కొబ్బరి బొండాలు తదితరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్బు, చిత్రా లోకనాధన్, కమలనాథన్, లోక వినాయకం, చిత్రా మహేంద్రన్, పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజలకు వాటర్ బాటిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే కార్తికేయన్

లెక్కింపు కేంద్రం సమీపంలో డ్రోన్లపై నిషేధం

వేలూరు, మే 6: స్థానిక తందై పెరియార్ ఇంజనీరింగ్ కళాశాల, పరిసర ప్రాంతాల్లో డ్రోన్లు ఎగిరేందుకు నిషేధం విధించినట్లు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి తెలిపారు. వేలూరు లోక్‌సభ ఎన్నికలు గత నెల 19వ తేది నిర్వహించగా, ఈవీఎంలను తందై పెరియార్ ఇంజనీరింగ్ కళాశాలకు తరలించి, స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరచి, కళాశాల ప్రాంగణంలో మూడెంచెల భద్రత ఏర్పాటుచేశారు.ఈనేపథ్యంలో, కళాశాల నుంచి ఒకటిన్నర కిలో మీటర్ల దూరం డ్రోన్లు ఎగిరేందుకు నిషేధం విధిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

రూ.100 కోట్లతో తిరునిండ్రవూర్ జలాశయ పునరుద్ధరణ

ఐసిఎఫ్, మే 6: నగరవాసులకు తాగునీరందించేందుకు రూ.100 కోట్లతో తిరునిండ్రవూర్ జలాశయాన్ని పునరుద్ధరించనున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. చెన్నై నగరంలో తాగునీటి అవసరం నెలకు ఒక టీఎంసీ. విస్తరణ ప్రాంతాల అభివృద్ధితో తాగునీటి అవసరాలు 2 టీఎంసీలకు పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని అదనంగా నీటి వనరులు రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తిరువళ్లూర్ జిల్లాలో ఉన్న తిరునిండ్రవూర్ జలాశయాన్ని చెన్నై తాగునీటి ఆధారంగా మార్చేందుకు రూ.100 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఈ విషయమై జలవనరుల శాఖ అధికారులు మాట్లాడుతూ... తిరునిండ్రవూర్ జలాశయానికి 0.15 టీఎంసీల సామర్థ్యం ఉందని, దీనిని 0.50 టీఎంసీలకు పెంచేలా చర్యలు చేపట్టామన్నారు. 862 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ జలాశయాన్ని అభివృద్ధి చేయడం వల్ల నగరవాసుల తాగునీటి అవసరాలు 15 రోజులకు సరిపడతాయని అధికారులు తెలిపారు.

ఆ పిటిషన్‌పై విచారణ త్వరితగతిన పూర్తిచేయాలి

సర్కారు వినతిని అంగీకరించిన సుప్రీం

అడయార్, మే 6: వరద సాయంగా కేంద్రం ఇవ్వాల్సిన నిధులు త్వరగా ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను త్వరితగతిన పూర్తి చేయాలంటూ చేసిన వినతిపై సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. గత యేడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాను సంభవించడంతో భారీ వరదలు పలు జిల్లాలను ముంచెత్తాయి. ఈ తుఫాను వరద సాయంగా రూ.37,907 కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ప్రధానమంత్రి మోదీని కలిసి స్వయంగా వినతిపత్రం కూడా సమర్పించారు. అయితే, ఈ వరద సాయంలో తక్షణ సాయంగా రూ.2 వేల కోట్లను విడుదల చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రభుత్వం గత నెల 3వ తేదీ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం ఎదుట సోమవారం మరోమారు విచారణకు రాగా, ప్రభుత్వం తరపున విల్సన్, కుమణన్ హాజరయ్యారు. రాష్ట్రానికి వరద సాయంగా రూ.37,907 కోట్ల సాయం తక్షణం ఇచ్చేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ త్వరితగతిన పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సుప్రీంకోర్టు మెయిల్ పంపితే తక్షణం పరిశీలిస్తామన్నారు.


వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో ఈవీఎంలు భద్రపరచిన తందై పెరియార్ ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌ను సోమవారం పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్

80 మంది కుటుంబసభ్యుల నడుమ వందేళ్ల బామ్మ పుట్టినరోజు వేడుకలు

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా వలవనూరు సమీపం రాంబాక్కం కాలనీకి చెందిన మునియమ్మాళ్ అనే వందేళ్ల బామ్మ 80 మంది కుటుంబ సభ్యుల మధ్య అట్టహాసంగా పుట్టిన రోజువేడుకలు జరుపుకున్నారు. ఆ బామ్మ ఆశీస్సులు పొంది, ఆమెకు శుభాకాంక్షలు తెలుపటానికి కుటుంబసభ్యులే కాక గ్రామస్థులంతా బారులు తీరారు. సోమవారం ఉదయం మునియమ్మాళ్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐదుగురు కుమార్తెలు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్లు కలిసి పుట్టిన రోజువేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా మునియమ్మాళ్ భారీ కేక్ కట్ చేసి కుటుంబ సభ్యులందరిచేత తినిపించి, ఆశీస్సులందించారు.


కుటుంబీకుల మధ్య పుట్టిన రోజువేడుకలు జరుపుకుంటున్న మునియమ్మాళ్

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వలసరవాక్కంలో చలివేంద్రం ప్రారంభం

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కం అష్టలక్ష్మీ నగర్ ఆలపాక్కం మెయిన్‌రోడ్డులో సోమవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటైంది. సమితి కన్వీనర్ నరసింహన్, సభ్యులు పాల్గొని ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. భగవాన్ సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ సంస్మరణదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ఈ నెల 31వరకు నిర్వహించి, ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ సమితి సభ్యులు అందించే 70లీటర్ల పెరుగుతో మజ్జిగ తయారుచేసి అందరికీ పంపిణీ చేస్తామన్నారు.


చలివేంద్రం ప్రారంభించి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యసాయిసేవా సమితి సభ్యులు

విద్యార్థులకు ఆటల పోటీలు

వేలూరు, మే 6: తమిళనాడు సైన్స్ ఇయక్కం, కాలామ్‌పట్టు అరివుతోట్టమ్ సంఘం సంయుక్తంగా సోమవారం కాలాంపట్టిలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించాయి. 6 నుంచి 10వ తరగతి వరకు నిర్వహించిన ఈ పోటీల్లో 100 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి అరివుతోట్టమ్ ఆర్గనైజర్ సెంథిమిల్‌సెల్వన్ అధ్యక్షత వహించగా, తమిళనాడు సైన్స్ ఇయక్కమ్ జిల్లా అధ్యక్షుడు అముద, జిల్లా సెక్రటరీ జనార్ధనన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించగా, విజేతలకు నిర్వాహకులు బహుమతులు, సర్టిఫికేట్లు ప్రదానం చేశారు.


విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు

హిజ్రా నివేదా ఉత్తీర్ణత

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్లస్-2 పబ్లిక్ పరీక్షలకు హాజరైన ఏకైక హిజ్రా నివేదా ఉత్తీర్ణురాలైంది. ఆదివారం నీట్ కూడా రాసిన నివేదా డాక్టర్ కావాలన్నదే తన లక్ష్యమని ప్రకటించారు. ట్రిప్లికేన్‌కు చెందిన నివేదా తను చదివిన లేడీ విల్లింగ్టన్ పాఠశాల విద్యార్థి సంఘం లీడర్‌గా ఉంది. నివేదా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినందుకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ హేమమాలిని అభినందించారు.


నివేదాను అభినందిస్తున్న తోటి హిజ్రాలు

కలెక్టర్ కార్యాలయంలో మొరాయించిన లిఫ్ట్

● చిక్కుకున్న ఏడుగురు ఉద్యోగులు

వేలూరు, మే 6: స్థానిక కలెక్టర్ కార్యాలయ లిఫ్ట్‌లో ఏడుగురు ఉద్యోగులు చిక్కుకున్నారు. కార్యాలయ ప్రాంగణంలోని ట్రాన్స్‌ఫార్మర్ హఠాత్తుగా మరమ్మతులకు గురికావడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆ సమయంలో ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగులు లిఫ్ట్‌లో వెళ్తున్న సమయంలో విద్యుత్ అంతరాయం కలిగి మధ్యలో ఆగిపోయింది. దీంతో, లిఫ్ట్‌లో ఉన్న వారు భయంతో కేకలు పెట్టారు. అరగంట తర్వాత లిఫ్ట్ తాళం తీసి వారిని కాపాడి వెలుపలికి తీసుకొచ్చారు.



లిఫ్ట్ నుంచి ఉద్యోగులను బయటకు తీసుకొస్తున్న దృశ్యం

140 మంది సివిల్ జడ్జీల బదిలీ

పెరంబూర్, మే 6: రాష్ట్రవ్యాప్తంగా 104 మంది సివిల్ జడ్జీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు మద్రాసు హైకోర్టు రిజిస్ట్రార్ జ్యోతిరామన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం, చెన్నైలో ఏడుగురు సహా రాష్ట్రవ్యాప్తంగా 104 మంది బదిలీ అయ్యారు.

ఇకపై వాయిదాలు కుదరదు..

● ఈడీకి సుప్రీంకోర్టు

అడయార్, మే 6: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ కేసు అంశంలో మరింత సమయం కావాలంటూ కోరవద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరఫు న్యాయవాదులకు సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అక్రమ నగదు లావాదేవీల కేసులో సెంథిల్ బాలాజీని గత యేడాది ఈడీ అధికారులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఆయన బెయిల్ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. బెయిల్ కోరుతూ మద్రాస్ హైకోర్టులో సెంథిల్ బాలాజీ తరఫున దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చి, సెంథిల్ బాలాజీ కేసును రోజూ విచారణ జరపాలంటూ ఆదేశించింది. మద్రాస్ హైకోర్టు ఆదేశాలపై సెంథిల్ బాలాజీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయమూర్తులు అబ్బాస్ ఎస్ ఓహా, ఉజ్జల్ బుయాన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఆ సమయంలో ఈడీ తరఫు న్యాయవాదులు హాజరై ఈ కేసు విచారణను మరో తేదీకి మార్చాలని, మరికొంత సమయం కావాలంటూ కోరారు. దీనిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇంకా ఎంత సమయం కావాలని, ఇకపై వాయిదాలు వేసే అవకాశం లేదని పేర్కొంటూ ఈ నెల 15వ తేదీకి వాయిదా వేసింది.

ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రారంభం

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్లస్-2 ఫలితాలు విడుదల కావటంతో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు నమోదు కార్యక్రమాలు సోమవారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. బీఈ, బీటెక్ కోర్సులలో అడ్మిషన్లు పొందటానికిగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకునే వెసులుబాటుండటంతో ప్లస్-2 ఫలితాలు వెలువడిన అరగంటకే రాష్ట్రంలో ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి పోటీపడ్డారు. ఈ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ జూన్ 6తో ముగుస్తుంది. జూన్ 12న సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ర్యాండమ్ నెంబర్లను కేటాయిస్తారు. జూన్ 13 నుంచి 30 వరకు సేవా కేంద్రాల్లో ఇంటర్నెట్ ద్వారా సర్టిఫికేట్లను సరిచూసుకోవాల్సి ఉంటుందని. ఆ తరువాత జూలై 10న ర్యాంకుల జాబితా విడుదల చేస్తారు. జూలై 11 నుంచి 20 వరకు అభ్యర్థులు సేవా కేంద్రాల ద్వారా తమ సమస్యలను తెలుపుకునే వీలు కల్పిస్తారు. ఆ తర్వాత ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్లకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. ముందుగా ప్రభుత్వ పాఠశాలలో చదివిన స్పెషల్ రిజర్వేషన్ విద్యార్థులకు కౌన్సెలింగ్ జరుపుతారు. ఆ తర్వాత స్పోర్ట్స్ కోటా, మాజీ సైనికుల కోటా తదితర కోటాలకు సంబంధించిన అభ్యర్థులకు వరుసగా కౌన్సెలింగ్ కొనసాగుతుంది.

ప్లస్-2 పాసైన విద్యార్థులకు సీఎం స్టాలిన్, నేతల శుభాకాంక్షలు

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్లస్-2లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు తన ఎక్స్ పేజీలో ఓ సందేశం విడుదల చేశారు. పాఠశాలల విద్య పూర్తి చేసుకుని ఉన్నత విద్యా కోర్సుల్లో చేరే వెళుతున్న విద్యార్థులంతా ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇదే విధంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కూడా ప్లస్-2లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, టీఎంసీ నేత జీకే వాసన్, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్, ఎఎంఎంకే నేత టీటీవీ దినకరన్ తదితర నాయకులు కూడా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్లస్ టూలో ఫెయిలైన విద్యార్థులకు కౌన్సెలింగ్

● వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు

అడయార్, మే 6: రాష్ట్రంలో సోమవారం ప్లస్‌టూ ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఈ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లుచేసింది. 104 టెలిఫోన్ వైద్య సహాయ సెంటర్, 14416 - నట్పుడన్ ఉంగలోడు అనే పేరుతో ప్రారంభించిన 24 గంటల పాటు పనిచేసే కేంద్రాలను తేనాంపేటలోని డీఎంఎస్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. 104 నంబరుకు కాల్ చేసే విద్యార్థులకు ఆరోగ్య సంక్షేమానికి సంబంధించిన సలహాలు, మానసిక సమస్యలు అధికమించేందుకు సూచనలు, సలహాలిస్తారు. అదేవిధంగా 14416 సెంటర్‌కు కాల్ చేస్తే మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు అవసరమైన సూచనలు సలహాలిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'మున్నోడి' పథకంలో భాగంగా 2020-21, 2021-22 సంవత్సరాల్లో నీట్ కోసం రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు, 104 మెడికల్ కాల్ సెంటరు ద్వారా 2020-21లో 1,10,971 మందికి, 2021-22లో 1,45,988 మంది విద్యార్థులకు వివిధ రకాల సూచనలు సలహాలిచ్చారు. 2022-23 విద్యా సంవత్సరంలో 12వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులకు మానసికస్థితిపై సూచనలు, సలహాలు ఇచ్చేలా కౌన్సెలింగ్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. ఆ ప్రకారంగా 2022-23లో మొత్తం 46932 మంది విద్యార్థులకు సూచనలిచ్చారు. వీరిలో 82 మంది విద్యార్థులు, 64 మంది విద్యార్థినులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్టు గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే, 2022-23లో నీట్ రాసి తక్కువ మార్కులు పొందిన 65823 మంది విద్యార్థులకు 104 కాల్ సెంటరు ద్వారా సూచనలివ్వగా 14416 సెంటరు ద్వారా మానసిక ఆందోళన, ఒత్తిడిని అధికమించేలా సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ యేడాది 20236-24లో 7,60,606 విద్యార్థులు ప్లస్‌టూ పరీక్షలు రాయగా, 51,919 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేదు. వీరిలో 32164 మంది విద్యార్థులు, 19755 మంది విద్యార్థినులున్నారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ముగ్గురు వైద్య నిపుణులు, ఒక మానసిక వైద్య నిపుణుడితో 14416 కేంద్రాలు పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంతేకాకుండా, తీవ్రమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులను గుర్తించి, వారిని తిరిగి మామూలుస్థితికి తీసుకొచ్చేలా ఈ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్‌తో పాటు సూచనలు, సలహాలివ్వనున్నారు. ఈ కేంద్రాన్ని ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ సోమవారం పరిశీలించారు.



మహిళ హత్య.. దోపిడీ

ముఠా కోసం గాలింపు

ప్యారీస్, మే 6: పరిశ్రమల నగరం కోవై నరసింహనాయకన్‌పాళయంలో పట్టపగలు ఇంట్లో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు మహిళను దారుణంగా హత్యచేసి మూడు సవర్ల నగలతో పరారైన సంఘటన స్థానికులను ఆందోళనకు గురిచేసింది. నరసింహనాయకన్‌పాళయంలో నివసిస్తున్న మనోహరన్-రేణుక దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. నీలగిరి జిల్లాకు చెందిన వీరు 12 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో ఇల్లు కట్టుకొని నివసిస్తున్నారు. రేణుక సమీపంలో ఉన్న ఓ బనియన్ కంపెనీలో పనిచేస్తుండగా, మనోహరన్ స్వెట్టర్లు తయారుచేసే కంపెనీ నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, ఆదివారం మధ్యాహ్నం మనోహరన్ తన ఇద్దరు కుమార్తెలతో కలిసి కోవై గాంధీపురం వెళ్లారు. ఇంట్లో రేణుక ఒంటరిగా ఉండగా, మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంట్లోకి చొరబడిన వ్యక్తులు ఆమెను హత్యచేసి మెడలో ఉన్న 3 సవర్ల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. ఇంటికి తిరిగొచ్చిన మనోహరన్ ఈ ఘటనపై అందజేసిన ఫిర్యాదు మేరకు పెరియనాయకన్‌పాళయం పోలీసులు రేణుక మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. సమీపంలో ఉన్న సీసీ పుటేజీ ఆధారంగా పరారైన నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుళల్ జైల్లో మహిళా ఖైదీ మృతి

ప్యారీస్, మే 6: స్థానిక పుళల్ సెంట్రల్ జైలులో అనారోగ్యానికి గురైన ఓ మహిళా ఖైదీ మరణించడంపై జైలు అధికారులు విచారణ ప్రారంభించారు. మాధవరం వీఎస్ మణినగర్‌కు చెందిన అల్ఫోన్స్ భార్య వేదామేరి (69)ని వరకట్నం వేధింపుల చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుపై తీర్పు వెలువరించిన న్యాయస్థానం, ఆమెకు రెండేళ్ల జైలుశిక్ష విధించడంతో పుళల్ జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా, ఆమె అనారోగ్యానికి గురికావడంతో జైలు వైద్యులు చికిత్స చేసినా కోలుకోలేదు. దీంతో ఈనెల 1వ తేది ప్రభుత్వ స్టాన్లీ ఆసుపత్రిలో చేర్పించారు. అయితే చికిత్స ఫలించక ఆదివారం సాయంత్రం వేదామేరి మృతిచెందడంతో కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

ఆటో నుంచి దూకి పారిపోయిన దొంగ

అడయార్, మే 6: ద్విచక్రవాహనాలు చోరీ చేస్తూ పట్టుబడిన ఉత్తరాదికి చెందిన దొంగను పుళల్ సెంట్రల్ జైలుకు ఆటోలో తరలిస్తుండగా కిందకు దూకేసి పారిపోయాడు. ఈ యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. స్థానిక ఓట్టేరి సూరత్ భవన్ వీధికి చెందిన సంజయ్ కుమార్‌కు చెందిన ద్విచక్రవాహనం గత నెల 29వ తేదీ చోరీకి గురైంది. దీనిపై ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ పుటేజీ ఆధారంగా వాషర్‌మెన్‌పేటకు చెందిన మనోజ్‌కుమార్ అనే యువకుడు ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించి అరెస్టు చేశారు. ఆ తర్వాత కోర్టులో హాజరుపరిచి పుళల్ సెంట్రల్ జైలుకు తరలిస్తుండగా, ఆటోలో నుంచి ఇందకు దూకేసి పారిపోయాడు.

భార్యను చంపి భర్త ఆత్మహత్యాయత్నం

ప్యారీస్, మే 6: స్థానిక బేసిన్‌బ్రిడ్జి సమీపంలోని మూలకొత్తలం వీపీఎం కోవిల్ వీధికి చెందిన సెల్వం (54) పద్మిని (52) దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సెల్వం ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసి పదవీవిరమణ పొందారు. కుటుంబ పోషణకు సరిపడా డబ్బు లేకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు ఏర్పడినట్లు తెలిసింది. ఆదివారం రాత్రి మళ్లీ భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో సెల్వం కోపంతో భార్య పద్మినిపై కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయి పడిపోయింది. ఇంటికి చేరుకున్న బాలాజీ గాయపడిన తల్లిదండ్రులను ప్రభుత్వ స్టాన్లీ ఆసుపత్రికి తరలించి, వాషర్‌మెన్‌పేట పోలీసులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం చికిత్స ఫలించక పద్మిని మృతిచెందింది. ఈ కేసుపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

దోపిడీల కోసం విమానంలో వచ్చే ముంబాయి దొంగ అరెస్టు

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో దారి దోపిడీలకు పాల్పడేందుకు ముంబాయి నుంచి తరచూ విమానంలో వచ్చే దొంగను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో రహదారుల్లో ఒంటరిగా నడిచే వెళ్లే మహిళలనే టార్గెట్‌గా చేసుకుని వారు ధరించిన నగలను అపహరించడం ఆ దొంగకు అలవాటు. ఇటీవల జరిగిన గొలుసు చోరీ కేసు దర్యాప్తు జరిపిన ఆదంబాక్కం పోలీసులు ఆ ముంబయి దొంగను అరెస్టు చేశారు. ఆదంబాక్కం గణేష్‌నగర్ ప్రాంతానికి చెందిన పద్మావతి అనే మహిళ మెడలోని బంగారు గొలుసును ఆ దొంగ లాక్కెళ్లాడు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల్లో నమోదైన వీడియో దృశ్యాలను పరిశీలించి ఆ గొలుసు దొంగ ముంబయికి చెందిన అమోల్ అని గుర్తించారు. నగరంలోని ఓ లాడ్జిలో దాగిన అతడిని పోలీసులు అరెస్టు చేశారు. అమోల్ ముంబయి నుంచి నగరానికి విమానంలో వచ్చి లాడ్జిలో కొద్ది రోజులు మకాంవేసి రోడ్లపై ఒంటరిగా నడిచి వెళ్లే మహిళల మెడలోని బంగారు గొలుసులను అపహరిస్తుంటాడని పోలీసులు విచారణలో వెల్లడైంది. 2019 నుంచి అమోల్‌పై నగరంలోని పలు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయని కనుగొన్నారు. అమోల్ నుంచి నగలు, మోటారు బైకు తదితర చోరీ వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సమాచార దర్శిని

జూన్ 28న సమాచార సాంకేతిక సదస్సు

ఐసిఎఫ్, మే 6: తమిళ సమాచార సాంకేతిక సదస్సు జూన్ 28,29 తేదీల్లో నందంబాక్కం వర్తక కేంద్రంలో జరుగనుంది. ఈ సదస్సులో ప్రముఖ సమాచార సాంకేతిక సంస్థలు, స్టార్టప్ సంస్థలు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, మార్కెటింగ్ ఏజెన్సీలు, రోబోటిక్ సాంకేతిక సంస్థలు, నిపుణులు హాజరుకానున్నారు. ఈ సదస్సులో సాఫ్ట్‌వేర్ రూపకల్పన, ఇతర అంశాలపై వ్యాసాలు సమర్పించి పరిశోధకులు వెల్లడిస్తారు.

10న అక్షయతృతీయ నగల దుకాణాల్లో బుకింగ్ ప్రారంభం

ఐసిఎఫ్, మే 6: అక్షయతృతీయను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా నగల దుకాణాల్లో అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభమైంది. చిత్తిరై మాసంలో అమావాస్య అనంతరం వచ్చే తదియను అక్షయతృతీయగా పిలుస్తారు. ఈ విశేష దినంలో వెండి, బంగారు ఆభరణాలు, వాహనాలు, ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతారు. ఈ ఏడాది అక్షయ తృతీయ ఈ నెల 10వ తేది వేకువజామున 4.17 గంటలకు ప్రారంభమై 11వ తేది మధ్యాహ్నం 2.50 గంటల వరకు కొనసాగనుంది. ఈ రెండు రోజుల్లో నగలు కొనుగోలు కోసం వినియోగదారులు ముందుగానే నగల దుకాణాల్లో బుకింగ్ చేసుకోవడం ప్రారంభించారు.

వాహనాలకు వేగ నియంత్రణ

ఐసిఎఫ్, మే 6: చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రోడ్డులో వాహనాల వేగ నియంత్రణ అమలులోకి వచ్చింది. చెన్నై-బెంగళూరు నగరాలను అనుసంధానిస్తూ రహదారి పనులు జరుగుతున్నాయి. ఇందులో 23.2 కి.మీ పొడవున మధురవాయల్-శ్రీపెరుంబుదూర్ మధ్య ఫ్లై ఓవర్ పనులు ఈ ఏడాది చివరలో ప్రారంభం కానున్నాయి. ఈ మార్గంలో ప్రతిరోజు సుమారు 1.15 లక్షల కార్లు , పీక్ అవర్‌లో లక్ష వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, చెన్నై-బెంగళూరు మధ్య ఏర్పాటైన ఎక్స్‌ప్రెస్ రోడ్డులో వాహనాలకు వేగ నియంత్రణ ప్రకటించారు. కార్లు 120 కి.మీ వేగం, బస్సులు 100 కి.మీ వేగంతో వెళ్లేందుకు అనుమతించారు.

పుట్లూరు రైల్వే గేట్ మూసివేత

ఐసిఎఫ్, మే 6: ఫ్లై ఓవర్ నిర్మించడంతో పుట్లూరు రైల్వేస్టేషన్ గేట్‌ను శాశ్వతంగా మూసివేశారు. తిరువళ్లూర్ జిల్లా పుట్లూరు రైల్వేస్టేషన్‌లో దిగి అంకాళ పరమేశ్వరి ఆలయం, కాకలూరు ఎస్టేట్ వంటి ప్రాంతాలకు ప్రతిరోజు వేలాది మంది ప్రయాణికులు, భక్తులు వెళుతుంటారు. ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణపనులు ఇటీవల పూర్తయ్యాయి. దీంతో రైల్వే గేట్‌ను అధికారులు శాశ్వతంగా మూసివేశారు. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణుల సౌకర్యార్థం సబ్ వే ఏర్పాటుచేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రులో 'హీట్ స్ట్రోక్' వార్డులు

ఐసిఎఫ్, మే 6: రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో 'హీట్ స్ట్రోక్'కు ప్రత్యేక వార్డులు ఏర్పాటయ్యాయి. ఈ ఏడాది వేసవి ప్రభావం ఎక్కువగా ఉంది. వడదెబ్బకు స్పృహ కోల్పోవడం, జ్వరం వంటి ఇబ్బందులకు గురవుతున్నారు. అస్వస్థతకు గురయ్యే వారికి చికిత్స అందించేలా అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఇన్‌పేషంట్, ఔట్ పేషంట్లు, ప్రజలకు ఓఆర్ఎస్ పౌడర్ అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో, హీట్ స్ట్రోక్ కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేశారు.

జూలై నుంచి బీచ్-చింతాద్రిపేట ఎంఆర్‌టీఎస్ రైళ్లు

ఐసిఎఫ్, మే 6: చెన్నై బీచ్-చింతాద్రిపేట మధ్య జూలై నుంచి ఎంఆర్‌టీఎస్ రైలు సేవలు ప్రారంభం కానున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. బీచ్ స్టేషన్-ఎగ్మూర్ మధ్య రూ.280 కోట్ల వ్యయంతో నాలుగో మార్గం పనులు గత ఏడాది ఆగస్టులో ప్రారంభయ్యాయి. ఈ కారణంగా బీచ్-చింతాద్రిపేట మధ్య రైలు సేవలు ఆగస్టు నుంచి నిలిపివేశారు. ఈ పనులు ముగింపు దశకు చేరుకోనుండడంతో జూలైలో రైళ్లు యధావిధిగా నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు మధ్యాహ్నం షిఫ్టు రద్దు

ఐసిఎఫ్, మే 6: ఈరోడ్‌లో పారిశుధ్య కార్మికులకు మధ్యాహ్నం షిఫ్టు పనులను అధికారులు రద్దు చేశారు.ఈజిల్లాలో రెండురోజులుగా ఎండతీవ్రత ఎక్కువగా ఉంది. మండుటెండలో కూడా ఈరోడ్ కార్పొరేషన్‌లో పారిశుధ్య పనులు ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుతున్నాయి. కార్మికులు వడదెబ్బకు గురవుతుండడంతో వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్నం షిఫ్టులు రద్దు చేశారు.ఆప్రకారం, ఉదయం 6 నుంచి 11 గంటలు, సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు రెండు షిఫ్టులుగా మార్చారు.

దక్షిణ జిల్లాల్లో పవన విద్యుదుత్పత్తి ప్రారంభం

ఐసిఎఫ్, మే 6: దక్షిణ జిల్లాల్లో పవన విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. తిరునల్వేలి, కన్నియాకుమారి, తూత్తుకుడి జిల్లాల్లో ఉన్న విండ్ మిల్లుల్లో విద్యుదుత్పత్తికి సానుకూలంగా గాలులు వీస్తున్నాయి. దీంతో, ఈ నెల 2వ తేది నుంచి ఉత్పత్తి ప్రారంభమైంది. ఆ రోజు 916 మెగావాట్ల ఉత్పత్తి జరిగింది. రాబోయే రోజుల్లో గాలి వేగం పెరిగే అవకాశముండడంతో ఉత్పత్తి మరింత పెంచనున్నట్లు తెలిపారు. ఈ విద్యుత్‌తో వేసవి విద్యుత్ అవసరాలు పూర్తవుతాయని అధికారులు పేర్కొన్నారు.

జనవరిలో కుత్తంపాక్కం బస్టాండ్ ప్రారంభం

ఐసిఎఫ్, మే 6: కుత్తంబాక్కం బస్టాండ్‌ను జనవరిలో ప్రారంభించనున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. నగరంలో రద్దీ నియంత్రించేందుకు శివారు ప్రాంతాల్లో కొత్త బస్టాండ్లు ఏర్పాటుచేసేందుకు సీఎండీఏ చర్యలు చేపట్టింది. పూర్తిగా ఏసీ సౌకర్యంతో నిర్మిస్తున్న కుత్తంబాక్కం బస్టాండ్ నిర్మాణపనులు 82 శాతం పూర్తయ్యాయని, ఈ బస్టాండ్‌లో 70 ఎక్స్‌ప్రెస్ బస్సులు, 30 ఆమ్నీ బస్సులు, 36 సిటీ బస్సులు నిలుపవచ్చని, ఇవి మినహా 1,680 టూ వీలర్లు, 230 ఫోర్ వీలర్ల కోసం రెండతస్తులతో పార్కింగ్ కల్పించనున్నామన్నారు. ఈ బస్టాండ్‌లో నాలుగు లిఫ్ట్‌లు, మూడు ఎస్కలేటర్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. 2025 జనవరి 1న ఈ బస్టాండ్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

జూన్‌లో సూరై ఫిషింగ్ హార్బర్ ప్రారంభం

ఐసిఎఫ్, మే 6: స్థానిక తిరువొత్తియూర్‌కుప్పం సూరై ఫిషింగ్ హార్బర్‌ను జూన్‌లో ప్రారంభించనున్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.కాశిమేడులో 570 పడవలు నిలిపేలా 1980లో ఫిషింగ్ హార్బర్ నిర్మించారు.అనంతరం పడవల సంఖ్య 2,000లకు చేరుకోవడంతో హార్బర్ విస్తరణకు చర్యలు చేపట్టారు. రూ.200 కోట్లతో జరుగుతున్న హార్బర్ విస్తరణ, అభివృద్ధి పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. పడవల మరమ్మతు యార్డు నిర్మాణపనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ పనులు పూర్తికాగానే జూన్ ఆఖరులో హార్బర్‌ప్రారంభించనున్నట్లుఅధికారులు తెలిపారు.



ధృవ్ విక్రమ్ కొత్త చిత్రం 'బైసన్'

చియాన్ విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్ హీరోగా ప్రముఖ దర్శకుడు మారి సెల్వరాజ్ తెరకెక్కించే కొత్త చిత్రానికి 'బైసన్' అనే టైటిల్ ఖరారు చేశారు. కబడ్డీ క్రీడాకారుడి జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఇందుకోసం ధృవ్ విక్రమ్ ముమ్మరంగా కబడ్డీ సాధన చేశాడు. అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్‌తో కలిసి ప్రముఖ దర్శకుడు పా.రంజిత్‌కు చెందిన నీలం ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్. ఇతర పాత్రల్లో లాల్, పశుపతి, కలైయరసన్, రజిషా విజయన్, హరి కృష్ణన్ అళగం పెరుమాళ్, అరవి మదన్ తదితరులు నటించనున్నారు. నివాస్ కె.ప్రసన్న ఈ చిత్రానికి సంగీతం సమకూర్చనున్నారు. కెమెరా ఎళిల్ అరసన్. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను సోమవారం రిలీజ్ చేశారు. 'పరియేరుం పెరుమాళ్', 'కర్ణన్', 'మామన్నన్' వంటి హిట్ చిత్రాలను తెరకెక్కించిన మారి సెల్వరాజ్.. ధృవ్ విక్రమ్‌ను దర్శకత్వం చేయడం ఇపుడు కోలీవుడ్‌లో ఆసక్తికంగా మారడమే కాకుండా, ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా నెలకొన్నాయి.

అలాంటి వారే నాపై ఆరోపణలు చేస్తున్నారు

● దర్శకుడు అమీర్


అమీర్, చాందిని, ఆదం బవ

తన అభిప్రాయాలతో ఏకీభవించలేని వారే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ప్రముఖ దర్శకుడు అమీర్ ఆరోపించారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'ఉయిర్ తమిళుక్కు' ఈ నెల 10వ తేదీ విడుదలకానుంది. రాజకీయ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించగా, ప్రీ రిలీజ్ ఈవెంట్ తాజాగా నగరంలో జరిగింది. ఇందులో అమీర్ మాట్లాడుతూ, 'ఇరైవన్ మిగపెరియవన్' చిత్ర నిర్మాత జాఫర్ సాధిక్ నా స్నేహితుడు కావడంతో ఆయనపై ఇచ్చిన ఆరోపణలను నాకు కూడా అంటగడుతున్నారు. జాఫర్ డ్రగ్స్ కేసులో నాకూ సంబంధం ఉన్నట్టు ఆరోపిస్తున్నారు. జాఫర్ ఏ మతస్తుడో నాకు తెలుసు. అతడు నా స్నేహితుడు. కానీ, అతను ఏం పనిచేస్తున్నాడు, డబ్బు ఎలా వస్తుంది అనే విషయాలను ఒక్క రోజు కూడా అడగలేదు. మనతో అనేక మంది స్నేహం చేస్తారు. వారి చరిత్ర ఏంటో తెలియదు కదా? లైకా ప్రొడక్షన్స్‌పై అనేక కేసులున్నాయి. ఆ సంస్థ నిర్మించే చిత్రాల్లో రజినీకాంత్ నటిస్తున్నారు. ఒక్క రోజైనా రజినీ వద్ద లైకా కేసుల గురించి ప్రస్తావించారా? కానీ 'ఇరైవన్ మిగపెరియన్' చిత్ర నిర్మాత జాఫర్ కావడం, ఆ చిత్రంలో నేను హీరోగా నటించడం వల్ల అతడిపై నమోదైన డ్రగ్స్ కేసు గురించి పదేపదే నన్ను ప్రశ్నిస్తున్నారు. నేను సినీ, రాజకీయ ప్రయాణం ప్రారంభించిన తర్వాత ఒక కొత్త వేదికపై నిలబడి మాట్లాడుతున్నాను. ఈ పరిస్థితుల్లో నేను ఎవరని ఆలోచన చేస్తే, రామాయణంలో వచ్చే సీత, నేను దాదాపుగా తోబుట్టువులం. ఆమె అగ్నిలో దూకి తన పవిత్రత నిరూపించుకున్నారు. కానీ, నేను ప్రతి వారం నిర్దోషినని నిరూపించుకుంటున్నాను. నేను ఎలాంటి తప్పు చేయలేదు' అని ఈ వేదిక ద్వారా ఘంటాపథంగా చెబుతున్నాను' అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రంలో అమీర్, చాందిని, ఆనంద్‌రాజ్, ఇమ్మాన్ అన్నాచ్చి, శరవణ శక్తి, మహానది శంకర్, సుబ్రమణ్యం శివ తదితరులు నటించారు. సంగీతం విద్యా సాదర్. మూన్ పిక్చర్స్ బ్యానరుపై ఆదంబ బవ నిర్మించారు.

డబ్బు కంటే కథే ముఖ్యం : ఈషా రెబ్బా

చిత్రజ్యోతి



'ఓయ్' అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌లో పరిచయమైన హీరోయిన్ ఈషా రెబ్బా కోలీవుడ్ కంటే టాలీవుడ్‌లోనే అధిక చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం ఆమె తమిళం, మలయాళ చిత్రాల్లో నటిస్తున్నారు. ఓ తెలుగు రీమేక్ చిత్రంలోనూ నటిస్తున్నారు. సినిమాల్లోనే కాకుండా, సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండే ఆమె... తాజాగా ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. 'మంచి దర్శకులు మంచి కథాంశం ఉన్న చిత్రాలనే రూపొందిస్తారు. నేను కూడా మంచి కథలకే ప్రాధాన్యత ఇస్తాను. స్పష్టంగా చెప్పాలంటే డబ్బు కంటే కథే ముఖ్యం. స్టోరీ ఆలకించిన తర్వాతే ఆ చిత్రంలో నటించాలా? వద్దా? అనేది నిర్ణయం తీసుకుంటాను. నాకు ఇచ్చే రెమ్యునరేషన్ ఆధారంగా మాత్రం కాదు' అని స్పష్టం చేశారు.

సంతానం సినిమా విడుదల 17వ తేదీకి వాయిదా


'ఇంగ నాన్ దాన్ కింగు'లో సంతానం

సంతానం హీరోగా నటించిన 'ఇంగ నాన్ దాన్ కింగు' చిత్రం విడుదల వాయిదా పడింది. నిజానికి ఈ నెల 10వ తేదీ రిలీజ్ చేయాలని ముందుగా అనుకున్నప్పటికీ.. అదేరోజు అనేక చిత్రాలు విడుదలవుతున్నాయి. దీంతో థియేటర్ల సంఖ్య తగ్గే అవకాశం ఉండటంతో ఈ సినిమాను 17వ తేదీకి వాయిదా వేశారు. ఆనంద్ నారాయణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అన్బుచెళియన్ సమర్పణలో సుష్మిత అన్బుచెళియన్ గోపురం ఫిలిమ్స్ బ్యానరుపై నిర్మించారు. ప్రియాలయ, మనోబాలా, తంబి రామయ్య, మునీష్‌కాంత్, బాల శరవణన్ తదితరులు నటించారు. డి.ఇమ్మాన్ సంగీతం. ఇటీవల ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ కూడా నిర్వహించారు. అయితే, అనివార్య కారణాలతో సినిమా విడుదల వాయిదా వేస్తున్నట్టు నిర్మాణ సంస్థ సోమవారం అధికారికంగా ప్రకటించింది.

ఐదేళ్ల చిన్నారిపై కుక్కల దాడి

● యజమాని సహా ముగ్గురి అరెస్ట్ ● పెంపుడు జంతువులకు లైసెన్స్ తప్పనిసరి: జీసీసీ


మీడియాతో మాట్లాడుతున్న జీసీసీ కమిషనర్ రాధాకృష్ణన్


ప్యారీస్, మే 6: స్థానిక థౌజండ్ లైట్స్ నియోజకవర్గంలో రెండు కుక్కలు ఐదేళ్ల చిన్నారిపై దాడిచేశాయి. తీవ్రంగా గాయపడిన చిన్నారికి చికిత్స కొనఅందిస్తున్నారు. దేశంలో నిషేధించిన రోట్‌వీలర్ జాతి శునకాలను పెంచుతున్న యజమాని సహా భార్య, కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కుక్కల దాడి వ్యవహారం వివాదాస్పదం కావడంతో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డా.జె.రాధాకృష్ణన్ ఈ వ్యవహారంలో సంబంధితులకు నోటీసు జారీచేసినట్లు సోమవారం మీడియాకు వివరించారు. వివరాలిలా... థౌజండ్ లైట్స్ ప్రాంతంలో జీసీసీ నిర్వహణలోని పబ్లిక్ పార్క్ వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న రఘు, తన భార్య సోనియా, ఐదేళ్ల కుమార్తె సుదక్షతో ఆ పార్క్ ప్రాంగణంలోని గదిలో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆదివారం సాయంత్రం పార్క్ సమీపంలో నివసిస్తున్న పుహళేంది తాను పెంచుకుంటున్న రెండు రోట్‌వీలర్ కుక్కలతో పార్క్‌కు వెళ్లాడు. ఆ సమయంలో పార్క్‌లో ఆడుకుంటున్న సుదక్షపై కుక్కలు దాడిచేశాయని, తల్లిదండ్రులు రక్షించడానికి ప్రయత్నించినా కుక్కలు వదిలిపెట్టలేదని తెలిసింది. తీవ్రంగా గాయపడి బాధతో కేకలేసిన చిన్నారిని పట్టించుకోకుండా కుక్కల యజమాని పుహళేంది అక్కడి నుంచి వెళ్లినట్లు తెలిసింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు పార్క్‌కు వెళ్లిన వారితో కలసి అంబులెన్స్‌లో చిన్నారిని రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ ఘటనపై అందజేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు, పుహళేంది, ఆయన భార్య వరలక్ష్మి, కుమారుడు వెంకటేశన్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం వారు బెయిలుపై విడుదలయ్యారు. ఇదిలా ఉండగా, కుక్కల దాడి వ్యవహారంపై స్పందించిన జీసీసీ కమిషనర్ రాధాకృష్ణన్... దేశంలో నిషేధించిన రోట్‌వీలర్ కుక్కలను పెంచుకొనేందుకు పుహళేంది ఎలాంటి లైసెన్స్ పొందలేదని, దీనిపై వివరణ కోరుతూ ఆయనకు నోటీసు జారీచేశామన్నారు. వీధుల్లో సంచరిస్తున్న కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇంట్లో కుక్కలు, పిల్లులు తదితర ప్రాణులను పెంచుకొనేందుకు వాటి యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని, నిర్లక్ష్యం చూపకుండా సకాలంలో ఇంజక్షన్ వేయించాలని తెలిపారు. రోట్‌వీలర్, పిట్‌బుల్ టెరియర్, అమెరికన్ బుల్‌డాగ్, మాస్టిఫ్‌లతో సహా 23 జాతుల కుక్కలను పెంచుకోవడంపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించిందని, నగరంలో ఈ రకాలను పెంచుకోరాదని హెచ్చరికలు కూడా జారీచేసినట్లు తెలిపారు.


కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి

శ్రీరంగంలో వైభవంగా చిత్తిరై మహారథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): భూలోకవైకుంఠంగా పేరొందిన, అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో మొదటిదైన శ్రీరంగం రంగనాథస్వామివారి ఆలయ మహారథోత్సవం సోమవారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ ఆలయంలో వార్షిక చిత్తిరై బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 28న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వారం రోజులుగా నంబెరుమాళ్ వివిధ వాహనాల్లో ఊరేగారు. ఈ నెల ఒకటిన స్వర్ణ గరుడవాహనంలో, ఆదివారం ఉదయం రజత అశ్వవాహనంలో ఊరేగారు. ఆదివారం సాయంత్రం స్వామివారు స్వర్ణ అశ్వవాహనంలో ఆలయ మాడ వీధుల్లో ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. ఇక ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహా రథోత్సవం సోమవారం ఉదయం ప్రారంభమైంది. దీనికోసం వేకువజాము 4.30 గంటలకు అద్దాల మండపం నుంచి బయల్దేరిన నంబెరుమాళ్ చిత్తిరై రథ ఆస్థాన మండపంలో వేంచేశారు. ఆ తర్వాత వేకువజాము 5.15 గంటలకు మేష లగ్నంలో మహారథంలో ప్రత్యేకపీఠంపై ఆశీనులయ్యారు. ఆ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరుగంటలకు మంగళవాయిద్యాల నడుమ నంబెరుమాళ్ మహారథం బయలుదేరింది. భక్తులు రథానికి ఇరువైపులా ఉన్న మోకుతాళ్లను లాగుతూ వెళ్లారు. తూర్పు చిత్తిరై వీధి నుంచి బయలుదేరిన రథం, దక్షిణ చిత్తిరై వీధి, పడమటి చిత్తిరై వీధి, ఉత్తర చిత్తిరై వీధి మీదుగా ఊరేగి ఉదయం 10 గంటలకు రథమండపానికి చేరింది. నాలుగు చిత్తిరై వీధుల్లో రథంపై ఊరేగింన నంబెరుమాళ్‌కు నగరవాసులు, భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. మహిళలు నేతి దీపాలతో రథం వెనుక నడిచారు. రథోత్సవం సందర్భంగా శ్రీరంగం అంతటా భక్తజన సంఘాలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులు పానకం, మజ్జిగ పంపిణీ చేశాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. స్థానిక పోలీసులు, ఆలయ నిర్వాహకులు రథోత్సవంలో పాల్గొన్న వేలాదిమంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేపట్టారు.



ముల్లైపెరియార్ డ్యాం పటిష్ఠతకు అనుమతించాలి

● సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాష్ట్ర ప్రభుత్వం

ప్యారీస్, మే 6: తమిళనాడు-కేరళ రాష్ట్రాల మధ్య కొలిక్కిరాని ముల్లైపెరియార్ డ్యాంను పటిష్ఠం చేసేందుకు అనుమతించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. నదీజలాల పంపిణీలో పలు రాష్ట్రాలతో తమిళనాడు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు జలాలు విడుదల చేయకుండా మొండిచేయి చూపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా, ముల్లైపెరియార్ డ్యాంలో నీటిమట్టం పెంచుకొనేందుకు కేరళ ప్రభుత్వం అడ్డుకుంటూ వస్తోంది. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ముల్లైపెరియార్ డ్యాం జలాలను తమిళనాడు వినియోగించుకొనేలా ఆంగ్లేయులు తమ ప్రభుత్వ హయాంలో 99 సంవత్సరాలకు ఒప్పందం కుదిర్చారు. ప్రారంభంలో డ్యాం పర్యవేక్షణ హక్కు, డ్యాంలో చేపల వేట హక్కు, డ్యాంను సందర్శించే పర్యాటకులను ఎంపిక చేసే హక్కులు తమిళనాడు ప్రభుత్వ పరిధిలో ఉండేది. అయితే 1970వ సంవత్సరం నుంచి తమిళనాడు ఈ హక్కులను కోల్పోయింది. ముల్లైపెరియార్ డ్యాం ఎత్తు 152 అడుగులు కాగా, ఆ డ్యాం పటిష్ఠత కోల్పోయిందంటూ కేరళ ప్రభుత్వం కారణం చూపి 136 అడుగుల వరకే నీటినిల్వలు అనుమతిస్తోంది. ఇందువల్ల రాష్ట్ర రైతులు, డ్యాం పరిసర ప్రాంతాల్లో ప్రజల నీటి కొరత తీర్చేందుకు నీటినిల్వలు పెంచేందుకు అనుమతి కోరుతూ సుప్రీంకోర్టును ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు, మద్రాసు హైకోర్టులు రాష్ట్రప్రభుత్వానికి మద్దతుగా తీర్పులిచ్చాయి. దీంతో, బేబీ డ్యాం పటిష్ఠం చేసి, 152 అడుగుల వరకు నీటిమట్టాలు పెంచుకొనేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టింది. ఇందుకు అభ్యంతరం తెలిపిన కేరళ ప్రభుత్వం, డ్యాంలో 142 అడుగల ఎత్తు వరకే నీటినిల్వలుండాలని సూచించింది. దీంతో కేరళ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా రాష్ట్రప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. 2021వ సంవత్సరం డ్యాంల భద్రతా చట్టం ప్రకారం తమిళనాడుకు తగు న్యాయం చేకూర్చాలని, డ్యాం పటిష్ఠపరిచేందుకు కేరళ ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని ఆ పిటిషన్‌లో ప్రభుత్వం సూచించింది.

నవరస భరితం.. అమూల్య నాట్యం



చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన భరతనాట్య కళాకారిణి అమూల్య ఇటీవల బెంగళూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భరతనాట్య అరంగేట్రం చేశారు. ప్రముఖ కూచిపూడి కళాకారిణి, నాట్యసరస్వతి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు డాక్టర్ సరస్వతి రజతేష్ ముఖ్య అతిథిగా, 'కళా గ్రంథ' డైరెక్టర్ శరత్ సీకే గౌరవ అతిథిగా హాజరై అమూల్యను ఆశీర్వదించారు. పుష్పాంజలితో ప్రారంభమైన ఈ కార్యక్రమం దేవిస్తుతి, నవరస కృష్ణలీల వర్ణం, శివకృతి, జావళి తదితర నాట్యరీతులు, హంసానందిని రాగంలో థిల్లానాతో రసమయంగా సాగింది. అమూల్య నృత్యం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకోవడంతో పాటు విమర్శకుల ప్రశంసలు సైతం పొందింది. కాగా నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, తెలుగు ప్రముఖులు ఎరుకలయ్య మూడో కోడలే అమూల్య.

నేత్రవైద్యంలో విశిష్ట సేవలు

● డాక్టర్ సూసన్ జాకబ్‌కు అంతర్జాతీయ గుర్తింపు



చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ సూసన్ జాకబ్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సర్జికల్ ఆప్తమాలజీ రంగంలో ఆమె విశిష్ట సేవలకు గాను ప్రపంచంలోని అత్యున్నతస్థాయి 20 మంది వైద్యనిపుణుల్లో ఒకరిగా ఎంపికయ్యారు. 'ది ఆప్తమాలజిస్ట్' అనే అంతర్జాతీయ ప్రచురణ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా అత్యున్నత శ్రేణిలో ఉన్న 20 మంది నేత్రవైద్య నిపుణులను ఎంపిక చేసి ప్రకటించింది.. అందులో డాక్టర్ సూసన్ జాకబ్‌కు 17వ స్థానం లభించింది. ఈ విషయమై డాక్టర్ అగర్వాల్స్ గ్రూప్ ఐ హాస్పిటల్స్ చైర్మన్ ప్రొఫెసర్ అమర్ అగర్వాల్ మాట్లాడుతూ తమ ఆస్పత్రి సహోద్యోగుల్లో ఒకరైన డాక్టర్ సూసన్ జాకబ్ నేత్రవైద్యంలో అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకోవడం తమకెంతో గర్వకారణమన్నారు. నేత్రవైద్య రంగంలో ఆమె భవిష్యత్ కార్యాచరణ పథకాలకు ఈ గుర్తింపు తగిన ప్రోత్సాహాన్ని కలిగిస్తుందన్నారు.


కేంద్రంలో ఎవరు అధికారంలోకి వచ్చినా రాష్ట్రానికి నష్టమే

● అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి



ప్యారీస్, మే 6: కేంద్రంలో ఎన్డీఏ, ఇండియా కూటమిలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రాష్ట్రానికి ఎలాంటి మేలు జరుగదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. ఆయన నగరంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ... లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ జాతీయ పార్టీల పొత్తు లేకుండా ఒంటరిగా పోటీచేసిందని, తమకు పలు నియోజకవర్గాల్లో విజయావకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటున్న ప్రధాని నరేంద్ర మోదీ ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా అభిప్రాయాలు వ్యక్తం చేయడం ఖండించదగ్గదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకే 'ఇండియా' కూటమిలో భాగస్వామ్యం వహిస్తుందని, రాష్ట్ర హక్కుల సాధనలో చతికిలబడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కర్ణాటక నుంచి కావేరి జలాలు పొందడానికి ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. ఇదే అభిప్రాయాన్ని తమ పార్టీ సీనియర్ నేత డి.జయకుమార్ సహా పలువురు పదే పదే గుర్తుచేస్తున్నారన్నారు. రాష్ట్ర సమస్యలను పరిష్కరింపజేయడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నిర్లక్ష్యం చూపుతున్నాయని, ఈ పార్టీల వైఖరిని ఎండగడుతూ అన్నాడీఎంకే వరుస ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తుందని ఎడప్పాడి తెలిపారు.

నేత్రపర్వంగా కన్యకా పరమేశ్వరి తెప్పోత్సవం


తెప్పపై అమ్మవారి విహారం

ప్యారీస్, మే 6: స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వైభవంగా కొనసాగుతున్న వసంతోత్సవంలో భాగంగా అమ్మవారు తెప్పపై విహరించారు. ఈ ఆలయంలో ఆదివారం ప్రారంభమైన తెప్పోత్సవం ఈ నెల 7వ తేది వరకు కొనసాగనుంది. ఆలయ మహామండపంలో కృత్రిమంగా కోనేరు నిర్మించారు. ముందుగా మూలమూర్తితో పాటు ఉత్సవమూర్తికి అభిషేకాలు, అలంకరణలు, ఆరాధనలు రెండవ రోజైన సోమవారం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని వెండి కేడియంపై కొలువుదీర్చి తెప్పలపై ఆశీనులను చేసి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. పాల్గొన్న భక్తులందరికి ఎస్కేపీడీ చారిటీస్ నిర్వాహకులు ప్రసాదాలు వితరణ చేశారు.

కొడైకెనాల్ వెళ్లే వారికి మూడు రంగుల్లో ఈ-పాస్

ప్యారీస్, మే 6: కొడైకెనాల్ వెళ్లే వారికి మూడు రంగుల్లో ఈ-పాస్‌ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందని దిండుగల్ జిల్లా కలెక్టర్ పూంగొడి సోమవారం ప్రకటించారు. రాష్ట్రంలో ఎండలు మండుతున్న నేపథ్యంలో, చల్లటి ప్రాంతాల్లో సేదతీరేందుకు ప్రజలు వెళ్తున్నారు. నీలగిరి జిల్లా ఊటీ, దిండుగల్ జిల్లా కొడైకెనాల్ వేసవి విడిది కేంద్రాలకు వెళ్లే పర్యాటకుల సంఖ్య తగ్గించి వాహనాల రద్దీని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని మద్రాసు హైకోర్టు రాష్ట్ర పర్యాటక శాఖకు ఆదేశించింది. ఆ మేరకు కొడైకెనాల్‌కు వెళ్లే పొరుగు రాష్ట్రాలు, జిల్లాలు, విదేశాలకు చెందిన పర్యాటకులు మంగళవారం నుంచి జూన్ 30వ తేది వరకు ఈ-పాస్ తీసుకోవాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో, కొడైకెనాల్‌కు ప్రభుత్వ బస్సుల్లో వెళ్లే పర్యాటకులకు ఈ-పాస్ నమోదు అవసరం లేదని జిల్లా కలెక్టర్ పూంగొడి మీడియాకు వివరించారు. స్థానికంగా ఉన్న ప్రజలకు పచ్చరంగు గుర్తింపు కార్డు, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకెళ్లే వాహనాలు, ఇతర సరుకులు తరలించే వాహనాలకు నీలిరంగు గుర్తింపు కార్డు, పర్యాటకం, వ్యాపార సంబంధిత వాహనాలకు ఊదా రంగుతో ఈ-పాస్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కొడైకెనాల్ సిల్వర్ జలపాతం ప్రాంతాల్లో ఉన్న టోల్ గేట్లలో స్థానికులకు సంబంధించిన వాహనాలకు మంగళవారం నుంచి జూన్ 30వ తేది వరకు పన్ను మినహాయింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పన్ను మినహాయింపు కోసం ఎంపికైన వాహనాలకు ఆ వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బీమా ధ్రువ పత్రం, యజమాని పాస్ పోర్ట్ సైజు ఫొటోతో వత్తలగుండు ఆర్టీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని ఈ-పాస్ పొందవచ్చని తెలిపారు. కొడైకెనాల్‌కు వెళ్లే అన్ని రకాల వాహనాలను సిల్వర్ జలపాతం టోల్ గేట్ వద్ద ఈ-పాస్ తనిఖీ చేసిన తర్వాతే ఘాట్ రోడ్డు వైపు అనుమతిస్తామన్నారు. టోల్‌గేట్లలో సిబ్బంది సెల్‌ఫోన్ యాప్ ద్వారా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి పర్యాటకుల వివరాలు తెలుసుకోవచ్చని కలెక్టర్ పూంగొడి తెలిపారు. ఈ-పాస్ కోసం epass.tnega.org అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

ఇండియన్ బ్యాంక్ నికర లాభం రూ.2247 కోట్లు


ఎస్ఎల్ జైన్

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి) : గత మార్చితో పూర్తయిన ఆర్థిక సంవత్సరంలో ఇండియన్ బ్యాంక్ నికర లాభం రూ. 22.47 కోట్లకు పెరిగింది. ఇది గత యేడాది మార్చి కంటే 55 శాతం అధికం. ఇక బ్యాంక్ అంతర్జాతీయ వాణిజ్యం 12 శాతం అధికమై రూ.12.22 లక్షల కోట్లకు పెరిగిందని ఆ బ్యాంక్ ఆర్థిక ఫలితాల ప్రకటనలో వెల్లడించారు. నికర వడ్డీ ఆదాయం 9 శాతం పెరిగి రూ.6015 కోట్లకు చేరిందని, ఈక్విటీల రిటర్న్స్ 19.06 శాతానికి పెరిగింది. బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 11 శాతం పెరిగి రూ.688000 కోట్లకు చేరింది. గత మార్చితో ముగిసిన త్రైమాసిక ఫలితాల్లో బ్యాంక్ నికర లాభం 6 శాతం పెరిగి రూ.2119 కోట్ల నుంచి రూ.2247 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం రూ.5815 కోట్ల నుంచి రూ.6015 కోట్లకు పెరిగింది. ఇక దేశవ్యాప్తంగా 1985 రూరల్ బ్యాంక్‌లు, 1536 సెమీ అర్బన్ బ్యాంక్‌లు, 1174 అర్బన్, 1158 మెట్రో బ్యాంక్‌లు సహా మొత్తం 5847 బ్రాంచీలతో ఇండియన్ బ్యాంక్ ప్రగతిపథంలో పయనిస్తోందని బ్యాంకు ఎండీ ఎస్ఎల్ జైన్ పేర్కొన్నారు.

జన కేతనం

ప్రచార పంపకాల్లో చిలక్కొట్టుడు



దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే తీరుగా ఇక్కడి పార్టీల నాయకులు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో దొరికినకాడికి సంపాదించుకోవాలని తాపత్రయపడుతున్నారు. ఓట్ల కొనుగోలు కంటే ముందుగానే ప్రచార పర్వంలో ఇందుకు తెర లేపారు. ప్రచారానికి ఇస్తున్న సొమ్ములో కొందరు నాయకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పట్టణ వార్డుల్లో ప్రజాప్రతినిధులకు ప్రచార బాధ్యతలు అప్పగించారు. వీరు రోజూ వార్డులో 20మంది చొప్పున తిప్పాల్సి ఉంటుంది. బూత్ కన్వీనర్, (రాజీనామా చేసిన) వలంటీర్ ఇందులో పాల్గొంటారు. జెండాలు పట్టుకుని తిరిగేవారికి రోజుకు రూ.300 చొప్పున, వలంటీరుకు, బూత్ కన్వీనరుకు రూ.500 ఇవ్వాల్సి ఉంటుంది. ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్ కూడా పెట్టాలి. అయితే కొంతమంది ప్రజాప్రతినిధులు ప్రచార వ్యయంలో కొంతసొమ్ము జేబులో వేసుకుంటున్నారని భోగట్టా. తమకిచ్చే మొత్తంలో కోతలు పెట్టడంతో ప్రచారానికి వచ్చిన వారు ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు. వారి ఇళ్లకు వెళ్లి పంచాయతీ పెడుతున్నారు. విషయం ఆ నోటా ఈనోటా తెలుసుకుంటున్న ఇన్‌చార్జిలు వార్డు ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడుతున్నారని సమాచారం.

- రేణిగుంట

ఇదీ మందుల — ఎన్నికల డ్యూటీనా..వద్దు బాబోయ్

ఎలక్షన్ డ్యూటీ అంటేనే ఉద్యోగులు విసుక్కుంటున్నారు. 2019 నాటి రెమ్యునరేషనే ఇప్పుడు కూడా చెల్లించాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులు చూసి పెదవి విరుస్తున్నారు. జిల్లాలో దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగులు ఇదెక్కడి శిక్ష అంటూ తెగ బాధ పడిపోతున్నారు. ఎన్నికల ప్రిసైండింగ్ అధికారి, కౌంటింగ్ సూపర్‌వైజర్‌కు రోజుకు రూ.350 చెల్లిస్తారట. నాలుగో తరగతి ఉద్యోగులకయితే రూ.200, వీడియో సర్వైలెన్సు టీముకు రూ.1200, వీడియో వ్యూయింగ్, అకౌంటింగ్ టీములకు రూ.1000 చెల్లిస్తామనడంతో వారంతా బిక్కముఖం వేస్తున్నారు. కంట్రోల్ రూము, కాల్‌సెంటర్ స్టాఫ్, మీడియా సర్టిఫికేషన్ మానటరింగ్ కమిటీ సిబ్బందికి భత్యం ఇంకా తక్కువ. రోజుకు రూ.200 మాత్రమే. పోలింగ్ విధులకు హాజరయ్యే పోలీసు, మొబైల్ పార్టీ సిబ్బందికి, హోంగార్డులకు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు లంచ్‌ప్యాక్‌తో పాటు రూ.150 చెల్లిస్తారట. ఇదేమూలకూ సరిపోదని సిబ్బంది గొణుక్కుంటున్నారు. ఇక ఓట్ల లెక్కింపు రోజు లంచ్ కింద రూ.150 చెల్లిస్తామనడంతో ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. కష్టమైన ఎన్నికల విధులకు హాజరయ్యే వారికి ఇంత తక్కువ రెమ్యునరేషన్ చెల్లించడం దారుణమంటున్నారు. మరోపక్క తమకు కూడా ఎన్నికల డ్యూటీ వేసి రూ.250 చెల్లిస్తామంటే దూరాభారం పోయొదెలా అని అంగన్‌వాడి కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.




- తిరుపతి (నేరవిభాగం)



బాపనయ్యా..శెభాషయ్యా..

87ఏళ్ల బాపనయ్యలో ఉత్సాహం ఓటెత్తింది కదూ.. అవును పడకగదికే పరిమితమైన అతడు సోమవారం ఓటేశాడు. కాలు కదపకుండానే తన ఓటు హక్కు వినియోగించుకున్నాడు. అన్ని అవయవాలు పనిచేస్తున్నా, పరిస్థితులన్నీ అనుకూలించినా ఓటేయని బద్ధకస్తులకు బాపనయ్య స్ఫూర్తిగా నిలిచాడు. 85ఏళ్లు దాటి పోలింగ్ బూత్‌కు రాలేని వృద్ధులకూ, దివ్యాంగులకూ ఈసారి ఎన్నికల కమిషన్ కల్పించిన హోం ఓటింగ్ సౌకర్యాన్ని ఇతను వినియోగించుకున్నాడు. తిరుచానూరుకు చెందిన బాపనయ్య 1970 నుంచీ క్రమం తప్పకుండా ఓటేస్తున్నాడు. అనారోగ్యకారణంగా పన్నెండేళ్లుగా కదలలేకపోతున్నాడు. ఓటు వేయలేకపోతున్నానని దిగులు పడేవాడు. కానీ ఈసారి ఎన్నికల సంఘం కల్పించిన హోం ఓటింగ్ పుణ్యమాని ఇంటికే సిబ్బంది వచ్చి రహస్య పద్ధతిపై ఓటేయించుకున్నారు. ఓటేశాక బాపనయ్య పొందిన ఆనందం అంతా ఇంతా కాదు.

- తిరుపతి(కలెక్టరేట్)



"చూస్తూ ఉండండి ఇక్కడొక గొప్ప పట్టణం ఏర్పడబోతోంది. ఇక్కడే ఆర్బీకే సెంటరు, ఇక్కడే హెల్త్ క్లినిక్, ఇక్కడే సెక్రటేరియట్, ఇక్కడే కళ్యాణమండపం, ఇక్కడే పార్కులు, స్కూళ్లు, ఇక్కడే ఆటో స్టాండు, ఇక్కడే జనతా బజారు.. ఈ ప్లాన్ చూస్తే ముచ్చటేస్తోంది. రాష్ట్రంలోనే మోడల్ కాలనీ ఇది"

- 2020 డిసెంబరు 28న ఊరందూరులో జగనన్న ఇళ్ల కాలనీల పథకాన్ని ప్రారంభిస్తూ సీఎం హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు ఇవి.

"అప్పట్లో, నవాబుల కాలంలో ఒక పట్టణం కట్టాలంటే 500 ఏళ్లు పట్టేది. శ్రీకాళహస్తి 25వేల ఇళ్లున్న పట్టణంగా అభివృద్ధి చెందడానికి 500 ఏళ్లు పట్టింది. ఇప్పుడు జగనన్న పట్టణం.. జేసిటీ కేవలం ఒకటిన్నర ఏళ్లలో ఇక్కడ ఏర్పడబోతోంది."

- అదే రోజున అదే సభలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి చెప్పిన గొప్పలు ఇవి.

మరి వాస్తవం ఎలా ఉంది?

జగనన్న పాలనలాగే ఉంది!



ఆంధ్రజ్యోతి - తిరుపతి/శ్రీకాళహస్తి

జేసిటీ అను జగన్ చూపిన సినిమా

మూడేళ్లు దాటినా ముప్పయి కుటుంబాలు కూడా లేని ఊరందూరు మోడల్ కాలనీ

మోడల్ జగన్ సిటీ

ఎక్కడ: ఊరందూరు సమీపంలో
విస్తీర్ణం: 157 ఎకరాలు
ఇళ్ల పట్టాలు: 4,953
ఇచ్చినవి: 4,304

మూడేళ్ల నాలుగు నెలల తర్వాత స్థితి

నిర్మాణం అయినవి: 1,240
స్లాబ్ దాకా వచ్చినవి: 1,760
పునాదులకే పరిమితం: 1,200
ఇటుక పడనివి: 753
నివాసం ఉన్న ఇళ్లు: 10



జే సిటీ ఇలా ఉంది..

కనీస మౌలిక సదుపాయాలు లేవు. కాలనీ మొత్తం బురదతో కూడిన రోడ్లే అధికంగా కనిపిస్తున్నాయి. కరెంట్, నీటి సరఫరా లైన్లు కొన్ని వీధులకే పరిమితమయ్యాయి. కొన్ని ఇళ్లు చెట్లు, రాళ్ల మధ్య ఉండిపోయాయి. లేఅవుట్ మొత్తం పూర్తయితే కానీ డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం సాధ్యం కాదని అధికారులు చేతులేత్తేశారు. లబ్ధిదారుల ఆప్షన్ మేరకు ప్రభుత్వమే కట్టిన ఇళ్లు పగుళ్లతో భయపెడుతున్నాయి. సమీపంలో ఉన్న పరిశ్రమల్లో పనిచేసే వ్యక్తుల అసాంఘిక కార్యక్రమాలకు ఈ ప్రాంతం అనువుగా మారింది. జగన్ శంఖుస్థాపన చేసిన ప్రదేశంలోనే మద్యం తాగుతున్నారు. ఆ ప్రాంతమంతా మద్యం బాటిళ్ల, పొగాకు ఉత్పత్తి ప్యాకెట్లతో నిండిపోయి కనిపిస్తోంది. తలుపులు, కిటికీలు లేని ఈ ఇళ్లు వ్యభిచారానికి అనువుగా మారిపోయాయి. దీంతో ఊరికి దూరంగా ఉన్నా సొంత ఇల్లు కదా అనే ఆశతో ఉన్న ఉపాధిని వదిలి వచ్చి ఇళ్లు కట్టుకున్నవారి పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ నివాసం ఉండలేమని నిర్ణయించుకుని దూరంగా అద్దె ఇళ్లలో ఉండాల్సి వస్తోంది.





ఇక్కడ ఇల్లు కట్టుకోవడం కరెక్టేనా...

సొంతిల్లు వచ్చిందని కదా అని సంబరపడ్డాం. ప్రభుత్వం కట్టిన ఇళ్లు సరిపోకపోవడంతో సొంత డబ్బుతోనే ఇల్లు కట్టుకుంటున్నా. నీళ్లు లేవు. ఇంటి నిర్మాణానికి కూడా నీళ్లలేక అవస్థ పడుతున్నాం. మనుషులే లేని ఈ కాలనీలో ఇల్లు కట్టుకోవడం కరెక్టేనా అనిపిస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- సుబ్రహ్మణ్యం, లబ్ధిదారుడు



ఎటు చూసినా బురద మడుగులే



పునాదులు దాటనివెన్నో!



తలుపులు, కిటికీలు లేని మోడల్ కాలనీలోని ఇళ్లు

ఈ డబ్బుతో ఇల్లెలా సాధ్యం?

ఇల్లు కట్టుకోవడానికి ఇస్తున్నది రూ.1.50 లక్షలు. ఉపాధి హామీ పథకం కింద మరో రూ.30 వేలు కలిపి రూ.1.80 లక్షలు ఇస్తున్నారు. ఆపై ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఆ నిధులు కూడా సక్రమంగా విడుదల చేయడం లేదు. జారీ చేసిన నిధుల వరకే కాంట్రాక్టర్లు ఇళ్లు నిర్మించి వెళ్లిపోయారు. నిజానికి మార్కెట్‌లో నిర్మాణ సామగ్రి ధరలు చుక్కల్లో ఉన్నాయి. ప్రస్తుత ధరలను బట్టి చదరపు అడుగుకు రూ.1,500 నుంచి రూ.2 వేలు ఖర్చు అవుతోంది. కానీ ప్రభుత్వం ఇస్తున్నది రూ.662 మాత్రమే. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ ప్రకారం ఇల్లు నిర్మించాలంటే దాదాపు రూ.5 లక్షల పైమాటే. అంటే మిగిలిన సొమ్మును పేదలు అప్పు చేసి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. సొంతింటి కలను ఎలాగైనా నెరవేర్చుకోవాలనే తపనతో కొందరు అప్పులు తెచ్చి వేలకు వేలు వడ్డీలు కడుతున్నారు. వీళ్లను చూసిన కొందరు బేస్మెంట్ లేవల్‌లోనే వదిలేసి వెళ్లిపోయారు. మొత్తం మీదుగా 'జే సిటీ' పేదల కలలకే పరిమితం అయ్యింది.

విజనరీ నేత నాయకత్వం కోసం..

నేను సైతం...

మాది తొట్టంబేడు మండలం పొయ్యి గ్రామంలో రైతు కుటుంబం. నేను చదువుకునే రోజుల్లో నాటి సీఎం చంద్రబాబునాయుడు విజన్-2020 గురించి చెబుతుండేవారు. భవిష్యత్ గురించి ఆయన విజన్ అర్థమయ్యేది. డిగ్రీ తర్వాత శ్రీకాళహస్తిలోని ప్రైవేటు స్కూలులో కొన్నాళ్లు పనిచేశాను. రూ.1000 జీతం వచ్చేది. ఐటీ రంగంతో ఉద్యోగ విప్లవం వస్తుందనే చంద్రబాబు మాటల స్ఫూర్తిగా కష్టపడి 2000లో తిరుపతి ఎస్వీఆర్ట్స్ కళాశాలలో ఎమ్మెస్సీ చదివాను. వెంటనే బెంగళూరులో ఉద్యోగం వచ్చింది. అక్కడ నుంచి అమెరికాలోని చికాగోలో అవకాశమొచ్చింది. 14 ఏళ్లుగా అక్కడే స్థిరపడ్డాను. నెలకు రూ.10లక్షల జీతం. అట్టడుగు నుంచి ప్రారంభమైన నా జీవితం ఉన్నత స్థాయికి చేరిందంటే చంద్రబాబు చలవేనంటాను. ఐటీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి వల్లే నాలాంటివారెందరి బతుకులో బాగుపడ్డాయి. వైసీపీ పాలనలో ఈ ఐదేళ్లుగా రాష్ట్రం అధోగతి పాలవుతోందని తెలిసి చాలా బాధ కలుగుతోంది. అందుకే రాష్ట్ర భవిత కోసం మళ్లీ చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టాల్సిన అవసరం ఉందని భావించాను. అందుకోసం ఆయన తరఫున ప్రచారం చేయాలని స్వస్థలం వచ్చాను. నేనేకాదు.. చంద్రబాబు విజనరీ కృషి ఫలితంగా ఉద్యోగాలు పొందిన 1200 మంది అమెరికా నుంచి వచ్చాం. నియోజకవర్గాల వారీగా సొంత ప్రాంతాల్లో ప్రజా చైతన్యానికి కృషి చేస్తున్నాం. అప్పుల పాలైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టి అభివృద్ధికి బాట వేసే శక్తి చంద్రబాబునాయుడికే ఉందని యువతకు వివరిస్తున్నాం.



- బి.త్రివేది కుమార్,ఎన్నారై

- శ్రీకాళహస్తి

అభయాంజనేయా..అనుగ్రహించు



సెంటిమెంట్

పన్నంగాడు ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు (ఫైల్)

రాజకీయ నాయకులకు సెంటిమెంట్లు ఎక్కువ. కీలకమైన ఎన్నికల సమయంలో మరీనూ. అడుగుతీసి అడుగు వేయాలంటే ఇష్ట దైవానుగ్రహాన్ని స్మరణకు తెచ్చుకోనిదే కదలరు. మామూలు రోజుల్లో అంతగా పట్టని సెంటిమెంట్లకు ఎన్నికల్లో మాత్రం అగ్రాసనమేస్తారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రచారం మొదలుపెట్టాలంటే నేతలంతా ఈశాన్యం సెంటిమెంట్ పాటించి తీరతారు. తడ మండలానికొచ్చే సరికి రాష్ట్ర సరిహద్దు పన్నంగాడు వద్ద ప్రసన్న ఆంజనేయస్వామిని దర్శించుకున్నాకే అడుగు ముందుకేస్తారు. అక్కడ నుంచే ప్రచారం మొదలుపెడతారు. దైవ నమ్మకమొక్కటే కాదండోయ్..కొన్నిసార్లు తడ మండల ఓట్ల మెజార్టీయే విజయావకాశాలను నిర్ణయిస్తుందని అభ్యర్థుల లెక్క. 2014లో వైసీపీ సుమారు 3,672 ఓట్ల మెజార్టీతో గెలవడంలో తడ మండలం కీలకంగా వ్యవహరించింది. దీంతో పార్టీల నాయకులు ఇప్పటికే ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

-తడ


ఈ గ్లాస్ 'గుర్తు'ండాల్సిందే..



థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అనే డైలాగ్‌తో సుపరిచితమైన సినీ నటుడు ప్రధ్వీ సోమవారం తిరుపతిలో సందడి చేశారు. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పక్కన తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఓ చిన్న అంగడిలో టీ తాగి తర్వాత అదే గ్లాసు చూపిస్తూ ఈ గుర్తుకే మీ ఓటు వేయాలని ఆ చిరువర్తకుడ్ని కోరుతూ కాసేపు హాస్యం పండించారు.

- తిరుపతి

పక్కా నాన్‌లోకల్ నియోజకవర్గం



సత్యవేడును వలస నియోజకవర్గంగా మార్చేశారనే మనోవేదన ఇక్కడి ప్రజల్లో దశాబ్దాలుగా ఉంది. సత్యవేడుకు ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేల్లో అత్యధికులు నాన్ లోకలే. కేవలం ఇద్దరు లోకల్స్‌కు మాత్రమే సత్యవేడు ఎమ్మెల్యే అయ్యే అవకాశం వచ్చింది. లోకల్స్‌లో 1985, 1994లో గెలిచిన ఎం.సురాజన్ ఒకరు కాగా ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆదిమూలం మరొకరు. సురాజన్ స్వగ్రామం సత్యవేడు మండలం సిరుణంబుదూరు. ఆదిమూలం స్వగ్రామం నియోజకవర్గంలోని నారాయణవనం మండలం భీమునిచెరువు. ఇక నాన్‌లోకల్ చరిత్రను పరిశీలిస్తే.. 1962లో జరిగిన మొట్ట మొదటి ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి తుంబూరు బలకృష్ణది పుత్తూరు. 1967లో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి కఠారి మునస్వామిది అప్పటి నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట. 1972, 1978, 1989ల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి సి.దాస్ మదనపల్లి వాసి. 1983లో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి తలారి ఆదిత్య మనోహర్‌ది గుడిపాల. 1999లో గెలిచిన టీడీపీ అభ్యర్థి ఎస్.శివప్రసాద్‌ది చంద్రగిరి. 2004లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి నారాయణస్వామిది కార్వేటినగరం. 2009లో ఎన్నికైన తెలుగుదేశం అభ్యర్థి హేమలత స్వస్థలం తూర్పు గోదావరి. 2014లో గెలిచిన తలారి ఆదిత్యది గుడిపాల. ఇలా పక్కా నాన్‌లోకల్ నియోజకవర్గంగా మారిన సత్యవేడుకు ఈసారి వైసీపీ నుంచి పోటీ చేస్తున్న నూకతోటి రాజేష్ కూడా నాన్ లోకల్. జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని వింజంలక్ష్మిరెడ్డిపల్లి ఈయన స్వస్థలం. నివాసం మాత్రం తిరుపతిలో.

- సత్యవేడు